నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: 11 కేవీ చెన్నాపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఎర్రన్న ఓ ప్రకటనలో తెలిపారు.

- లక్ష్మీనర్సింహస్వామి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెన్నాపురం, లక్ష్మీనగర్ కట్ట, నెహ్రూనగర్, శివనగర్, జయశంకర్‌కాలనీ, లెప్రసీ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, సిటిజెన్స్ కాలనీ, శాంతినగర్, మూడు గుళ్లు, చిలుకల బిల్డింగ్, రేణుక ఎల్లమ్మ దేవాలయం, ఆదర్శ్‌నగర్, వికలాంగుల కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదు.
- చెన్నాపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఆర్‌పీఎఫ్, అరుంధతినగర్, ఫారుక్‌బస్తీ, ఫారానగర్, మల్కారం, డంపింగ్‌యార్డు, పుల్లయ్య క్రషర్, గోశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



జగ్గంగూడలో నర్సరీని సందర్శిస్తున్న ప్రత్యేక అధికారులు

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) ప్రత్యేక అధికారులు మమత, శివ సోమవారం పర్యటించారు. లాల్‌గడి మలక్‌పేట, మూడు చింతలపల్లి మండలంలోని జగ్గంగూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు, శ్మశానవాటికలను అధికారులు పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఓపెన్ నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ బొల్లారం ఎయిర్ ఫోర్స్ రోడ్డు మాసంతోషినగర్ (బుడగ జంగాల బస్తీ)లో ఓపెన్ నాలాలో చెత్త వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి కోరారు. వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేయగా తక్షణమే అధికారులు ఓపెన్ నాలాలో ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కార్తీక్, నవీన్, రూపేష్, పవన్ తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: జీవో నంబర్–1 ఉల్లంగిస్తూ పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యువజన నాయకులు వర్కాల శివకిశోర్‌గౌడ్ కోరారు. బోడుప్పల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ జీవో నంబర్–1లో ఫీజులు, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, టై, బెల్ట్ వంటి వాటిపై పొందుపర్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు నియంత్రణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని, నిబంధనలు అతిక్రమించి పుస్తకాలను విక్రయించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆహ్వానం

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం టీజేఎస్ నాయకులు, మచ్చబొల్లారం ఉద్యమకారులు సోమవారం టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 2వ తేదీన బొల్లారంలో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయనను ఆహ్వానించారు. టీజేఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నాయకులు ఏర్పుల దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్, పుట్నాల కృష్ణ, గణేష్, తదితరులు ఉన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడిగా శ్రీనివాస్



రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం అధ్యక్షుడిగా భువనగిరి శ్రీనివాస్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆలయ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గట్టు ప్రకాష్ గుప్తా, కోశాధికారిగా ఊరే నాగేష్ గుప్తా, సహాయ ప్రధాన కార్యదర్శిగా వై.కొండయ్య గుప్తా, సహాయ కోశాధికారిగా కుర్తివాడ శ్రీనివాస్ గుప్తా, ట్రస్ట్ మెంబర్, కమిటీ చైర్మన్‌గా శంభు, పాండయ్య గుప్తాను ఎన్నుకున్నారు.

నేటి నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ షురూ

మల్కాజిగిరి: మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేయడానికి పాఠ్యపుస్తకాలు సిద్ధమయ్యాయి. మల్కాజిగిరి మండల పరిధిలో 4,629 మంది విద్యార్థులు, అల్వాల్ మండల పరిధిలో 4,452 మంది విద్యార్థులకు 48,832 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ప్రస్తుతం 27,405 పుస్తకాలు(56%) మండల విద్యాధికారి కార్యాలయానికి చేరుకున్నాయి. మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తామని మండల విద్యాధికారి శశిధర్ తెలిపారు.



మండల విద్యాధికారి కార్యాలయానికి చేరుకున్న పుస్తకాలు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

మల్కాజిగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

- హోలీమేరీ కాలేజీలో ఐదు నియోజకవర్గాల కౌంటింగ్
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్, వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్



సాక్షి,మేడ్చల్ జిల్లా: వచ్చే 4వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ ఏఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్వోలతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని గౌతమ్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన చర్యలపై ఏఆర్వోలకు ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి 28 టేబుళ్లు, మల్కాజిగిరి 20, కుత్బుల్లాపూర్ 28, కూకట్‌పల్లి 20, ఉప్పల్ 20, ఎల్‌బీనగర్ 28, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హోలీమేరీ కాలేజీలో ఐదు..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కీసర మండలంలోని భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్బీనగర్, వెస్లీ కాలేజీలో సికింద్రాబాద్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మాత్రం హోలీమేరీ కాలేజీలో నిర్వహిస్తామన్నారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాల్లో టేబుల్స్, సీసీ కెమెరాలు, విద్యుత్, ఇంటర్నెట్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి టీ, స్నాక్స్, భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్ రెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఏడు నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘హోలీమేరీ’లో ఏర్పాట్ల పరిశీలన

సాక్షి,మేడ్చల్ జిల్లా: భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను సోమవారం ఎన్నికల అధికారి గౌతమ్, రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషితో కలిసి పర్యవేక్షించారు. లోక్‌సభ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఏర్పాట్లకు అవసరమైన పలు సూచనలు, సలహాలను సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రతీ కౌంటింగ్ సెంటర్‌లో సీసీ కెమెరా, కరెంటు, ఇంటర్నెట్, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పద్మజ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వయోజనులకు బీసీజీ టీకా

- క్షయ (టీబీ) సంపూర్ణ అంతానికి కసరత్తు
- టీబీని 2025 నాటికి పూర్తిగా నివారించటమే లక్ష్యం
- క్షయ ఉన్న వ్యక్తుల కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే

సాక్షి, మేడ్చల్ జిల్లా: క్షయ(టీబీ)ను 2025 నాటికి సమర్థవంతంగా నివారించటమే లక్ష్యంగా ప్రభుత్వం వయోజనులందరికీ బీసీజీ టీకాను అందించటానికి ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో ఎంపిక చేసిన 17 జిల్లాల్లో టీకా కార్యక్రమాన్ని మొదటి దశలో అమలు చేయటానికి డీఐఓ, పీఓడీటీ, వైద్యాధికారులు, డీడీఎం, కోల్డ్ చైన్ వ్యాక్సిన్ మేనేజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో జూలై మాసాంతం లేదా ఆగస్టు మొదటి వారంలో టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వైద్యశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ షెడ్యూల్ విడుదల కాగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. సాధారణంగా శిశువు జన్మించిన 24 గంటల్లోపే బీసీజీ టీకాను వేస్తారు. ప్రస్తుతం వయోజనులకు రీవ్యాక్సినేషన్‌గా బీసీజీ టీకా వేయనున్నారు.

వెయ్యిమంది క్షయ బాధితులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో క్షయ(టీబీ) బాధితులు 1,000 మంది చికిత్స పొందుతున్నారు. నెలవారీగా మందులను వైద్యశాఖ అందజేస్తోంది. చికిత్స పొందుతున్న బాధితుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితంగా ఉండేవారికి, ఇతరులకు వ్యాధి సోకే ప్రమాదం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఒక కుటుంబంలో 18 ఏళ్ల వయస్సు పైబడి పొగతాగేవారు, మధుమేహ బాధితులను, బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ– శరీర ద్రవ్యరాశి సూచిక) ప్రకారం తక్కువ బరువు ఉన్నవారిని గుర్తించి వివరాలను ఇంటింటి సర్వేలో నమోదు చేసుకుంటారు. ఇలాంటి వారికి బీసీజీ టీకాను అందజేయనున్నారు. ఇలాంటి వారు జిల్లాలో దాదాపు రెండు లక్షలకుపైగా ఉన్నట్లు వైద్యశాఖ అంచనా వేస్తోంది. బీసీజీ టీకా తీసుకోవటానికి సుముఖంగా లేనివారికి బలవంతంగా వ్యాక్సిన్ వేయరని, అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు మాత్రమే ఈ టీకాను వేస్తామని వైద్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

శిక్షణ తర్వాతే ఇంటింటి సర్వే

జిల్లా స్థాయిలో పీహెచ్‌సీల్లో మొదటగా వైద్యాధికారులకు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత పీహెచ్‌సీ స్థాయిలో ప్రజారోగ్య సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి శిక్షణ పూర్తయిన వెంటనే జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తారు.

- మేడ్చల్–మల్కాజిగిరిలో శిక్షణ పూర్తయిన తర్వాతే బీసీజీ టీకా ఇవ్వటానికి అర్హులైన వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తిస్తారు. నిబంధనలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించిన తర్వాత వచ్చే నెల చివరి వారం లేదా ఆగస్టు మొదటివారంలో టీకాను అందించడానికి వైద్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ టీకా(వ్యాక్సిన్) ద్వారా సమర్థంగా క్షయ నిర్మూలన అయ్యే అవకాశాలు ఉన్నట్లు వైద్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

కార్పొరేటర్ శ్రీవాణి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: రాంశంకర్‌నగర్‌లో రూ.12 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అదేవిధంగా నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను మార్చండి

మల్కాజిగిరి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారని రోడ్డు పనులు చేసినప్పుడు స్తంభాలు పక్కకు ఒరిగాయని, గాలి, వానకు ఎక్కడ కూలిపోతాయోనన్న భయంతో గడపాల్సి వస్తోందని వారు తెలిపారు. వినాయకనగర్ సబ్‌స్టేషన్ వద్ద అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎన్నికల సమయం ఉందని చెప్పారని, ఎన్నికలు అయిపోయినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని అంటున్నారు. స్థానిక కార్పొరేటర్ చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధిలో సాయిరాంనగర్ కాలనీల్లో చేపడుతున్న సీవరేజ్ పనులను స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో లో తట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను అధికారులే స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, జగన్, బాలు, శ్యామ్ సాయిరాం నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో రూ.27 కోట్లతో నీటి సరఫరా

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో తాగు నీటి సరఫరాకు రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్ రైతు సంఘం నాయకుడు దుబ్బ నర్సింహారెడ్డి వినతి మేరకు పరమేశ్వర్ రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉప్పల్ సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా భగాయత్ లేఅవుట్‌లో తాగునీటి పైపులైన్ లేక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వందలాది కుటుంబాలు నివసిస్తున్నా కనీస వసతులు లేవని గుర్తు చేశారు. చిలుకానగర్, హేమానగర్ మురుగు సమస్య పరిష్కారానికి రూ.1.50 కోట్లతో చేపట్టే పనులు త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని కోరారు. అలాగే సెవన్‌హిల్స్ కాలనీ, పద్మావతి కాలనీ, ఆనందనగర్, శ్రీశ్రీనగర్, గణేష్ నగర్ తదితర కాలనీల్లో రూ.3.98 కోట్ల భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గంలో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించినట్లు ఆయన వివరించారు.

నిప్పు.. భూసారానికి ముప్పు



నాగిశెట్టి పల్లిలో వరికొయ్యలను తగులబెడుతున్న దృశ్యం

- పొలాల్లో వరికొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టొద్దు
- కలియ దున్నితే ఎకరాకు టన్ను ఎరువుగా మార్పు
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

శామీర్‌పేట్: వరికోతల తర్వాత పొలాల్లోని వరికొయ్యలకు, గడ్డికి నిప్పు పెట్టకుండా, దానిని కలియ దున్నితే భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నిప్పు పెట్టడం వల్ల భూమిలోని ఉపయోగకర సూక్ష్మజీవులు చనిపోతాయని, భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. వరికొయ్యలకు నిప్పు పెట్టవద్దని రైతులకు సూచించారు.

నిప్పు పెట్టడం వల్లే జరిగే నష్టాలు..

- వాతావరణ కాలుష్యం పెంచుతుంది
- ఒక్కసారి కొయ్యకాళ్లను కాల్చడం వల్ల వ్యవసాయం 20 ఏళ్లు వెనుకబడినట్టే..
- వరికి మేలు చేస్తూ మట్టిలో ఉండే మిత్ర పురుగులు చనిపోతాయి
- నేలకు మేలు చేసే క్రిమికీటకాలు చనిపోవడమే కాక భూమి సారం కోల్పోతుంది
- నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దీంతో దిగుబడి తగ్గుతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- పొలాల్లో తిరిగే జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది.
- ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది
- గట్లు మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా అగ్గి వేడికి చనిపోతాయి.

ఇలా చేస్తే ప్రయోజం..

- రోటో వేటర్‌తో దున్నడం వల్ల కొయ్య కాళ్ళను చిన్న చిన్న ముక్కలుగా, పౌడర్‌గా మారుస్తుంది.



- వరి కొయ్యలు ఉన్న పొలంలో నీరుపెట్టి కలియ దున్నితే భూసారం పెరుగుతుంది.
- కొయ్యలను కలియ దున్నడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- కలియ దున్నడం వల్ల ఎకరాకు దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని (యూరియా), నాలుగు శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ దాతువులు పంటకు మేలు చేకూరుస్తాయి.
- నేలలో కరగని మూలకాలను మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.
- కొయ్యకాలను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

వరికొయ్యలకు నిప్పు పెట్టొద్దు



రైతులు వరికొయ్యలను తగలబెట్టడం వల్ల భూమిలోని ఉపయోగకరమైన జీవరాసులు మృతి చెందుతాయి. వాయు కాలుష్యం పెరుగుతుంది. వాటిని కలియ దున్ని మురుగ పెట్టడం ద్వారా ఎరువుగా మారి భూమి సారం పెరుగుతుంది.

– డా. రమేష్, మండల వ్యవసాయ అధికారి

సమస్యల పరిష్కారానికి వినతి

లాలాపేట: తెలంగాణ వ్యాప్తంగా గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించి దాదాపు ఏడాది కావస్తోందని డీడీలు చెల్లించిన వారికి న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు.

చలో పోదాం.. చిల్ అవుదాం!



నయగారా ఫాల్స్ వద్ద డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ గీత భాగ్యారెడ్డి దంపతులు

- పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు వెళ్లిన నేతలు
- ఎన్నికల్లో బిజీగా గడిపి.. ఇప్పుడు సేద తీరుతున్న వైనం
- ఎన్నికల ఫలితాలు వచ్చేనాటికి తిరుగుముఖం

మేడ్చల్: పార్లమెంటు ఎన్నికలతో రెండు నెలల పాటు బిజీగా గడిపిన స్థానిక నేతలు విహారయాత్రలతో సేదతీరుతున్నారు. ఎన్నికల కోడ్, గ్రామాలలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన నడుస్తుండటం, ఎంపీటీసీలకు, ఇతర ప్రధాన ప్రజాప్రతినిధులకు పెద్దగా రాజకీయపనులు లేకపోవడంతో నాయకులు యాత్రలబాట పట్టారు. ఎన్నికల ఫలితాలకు మరో వారం గడువు ఉండటంతో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు విహారయాత్రల మూడ్‌లోకి వెళ్లిపోయారు. అన్ని పార్టీల నేతలు తమ కుటుంబాలు, మిత్రులతో కలిసి టూర్ వేస్తున్నారు. జూన్ నాలుగో తేదీన ఫలితాలు రానుండటంతో అప్పటికల్లా తిరుగుముఖం పట్టనున్నారు.

ఉత్తర భారతం వైపు..

చాలామంది నేతలు ఉత్తరభారతం వైపు తీర్థయాత్రలు, విహార యాత్రలు చేస్తున్నారు. ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గంలో పని చేయడానికి బీజేపీ నేతలు వెళ్లి స్వామి కార్యం, స్వకార్యం నేరవేర్చుకుంటున్నారు. మోదీ కోసం పని చేయడంతో పాటు కాశీ విశ్వనాథుడి దర్శనం చేసుకుని పుణ్యం కోసం ప్రార్థనలు చేస్తూ గంగా స్నానాలు, ఇతర కార్యక్రమాలు చేసుకుంటున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు పోచయ్య, తదితరులు కాశీయాత్రకు వెళ్లారు. కొందరు నేతల సంతానం విదేశాలలో ఉండటంతో అక్కడికి వెళ్లి చిల్ అవుతున్నారు. డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ గీత, సీనియర్ నాయకుడు భాగ్యారెడ్డి దంపతులు అమెరికాకు వెళ్లారు. గుండ్లపోచంపల్లికి చెందిన నలుగురు కౌన్సిలర్లు ఉత్తర భారత్‌లో కలియతిరుగుతుండగా, కొందరు బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు దుబాయ్‌లో ఉన్నారు. తెలంగాణలో వివిధ స్థలాలు, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖ పట్టణం, చీరాల బీచ్, వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్ళి వస్తున్నారు. ప్రఖ్యాత ఆలయాలకు కుటుంబంతో కలిసి వెళ్ళి మొక్కులు చెల్లించుకుంటున్నారు.



వారణాసిలో బీజేపీ నాయకులు



విహార యాత్రకు వెళుతున్న మేడ్చల్ కాంగ్రెస్ కౌన్సిలర్ ప్రియాంక మధుకర్ దంపతులు

ముందు చూపుతో..

ఈ సంవత్సరంలో దాదాపుగా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో ముందుజాగ్రత్తగా ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమ ప్రధాన అనుచరులతో అలా తిరిగివస్తున్నారు. సర్పంచ్ పదవికి, వార్డు సభ్యుడి పదవికి, ఎంపీటీసీ కోసం, కౌన్సిలర్ కోసం పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్న నాయకులు రాబోయే ఎన్నికలలో తమకు కుడి, ఎడమ భుజంలా ఉండాలని ప్రధాన నాయకులతో కలిసి యాత్రలు చేస్తున్నారు. సగం ఖర్చులు తామే భరించుకుని పది మందితో కలిసి బృందంగా ఏర్పాటు చేసుకుని గుడి గోపురాలు, విహారయాత్రలు చేస్తున్నారు.

ప్రధాన నాయకులు..

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలుగు మహాసభల కోసం అమెరికాకు వెళ్ళగా, బీజేపీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ వారణాసికి వెళ్ళారు. మొత్తం మీద నాయకులు ఖద్దర్ బట్టలు స్వస్తి పలికి టీషర్టు, జీన్స్‌లు వేసి ఎంజాయ్ మూడ్‌లో కనిపిస్తున్నారు.